

కౌసల్యా సుప్రజా రామ పూర్వాసంధ్యాప్రవర్తతే
ఉత్తిష్ఠ నరశార్దూల కర్తవ్యం దైవమాహ్నికం.
ఉత్తిష్ఠోత్తిష్ఠ గోవింద! ఉత్తిష్ఠ గరుడధ్వజ!
ఉత్తిష్ఠ, కమలాకాన్త! త్రైలోక్యం మంగళం కురు.

# నా కృష్ణుడు ఏడమ్మా!

**విశ్వభరత్**

సుప్రభాతం వీనులవిందుగా, మనసును అలౌకికమైన భక్తిభావంలో ముంచెత్తుతూండగా మెలకువ వచ్చింది రాధకు. మనసులోనే ఎదురుగా




ఉన్న వేంకటేశ్వరుని పటానికి ప్రణతు లర్పించి, లేచి మంచంమీద కూర్చుంది.

ఇంతలోనే తండ్రి కంఠం వినిపించింది, "రామలక్ష్మమ్మా, ఇంకా రాధ లేవలేదా?" అంటూ.

రోజూ ఏడు గంటలు దాటి తను లేవకపోయినా లేపని నాన్నగారు, ఈ రోజు అప్పుడే 'ఇంకా లేవలేదా అంటున్నారేమిటి?' అనుకొంది రాధ. అంతలోనే ఏదో జ్ఞాపకం వచ్చి మనసు పులకరించి, 'వాళ్ళ వస్తారుగా' అంది.

'ఎందుకు?' అనుకొంది రాధ తనలో తనే.

'ఎందుకేమిటి? ఈ అందాల రాధను చూచుకొనేం దుకు, చూచుకొని ఇంచక్కా పెళ్ళి చేసుకొందుకు' అం దామె మనసు.

'ఛీ, ఫో. ఇంతక్రితం ఫోటోలు చూచుకొన్నాంగా!' అంది రాధ మనసుతో.

'ఏం, ఫోటోలో చూసినంతమాత్రాన మరోమారు చూడాలని నీకు లేదేమిటి?' అంది మనసు.

'ఎందుకు లేదూ?' అనుకొంది రాధ తనలో.

"తరవాత తీరుబడిగా కూర్చుని ఊహాలోకంలో విహరిద్దువు, ప్రస్తుతానికి లేచి దంతధావనాది కాల కృత్యాలు కానీవమ్మా!" అంది అప్పుడే అక్కడికి వచ్చిన రామలక్ష్మమ్మ.

రాధ చిన్నగా నవ్వి బాత్‌రూమ్‌వైపు నడిచింది.

రాధ బాత్‌రూమ్‌లో మొహం కడుక్కొంటూండ గానే తండ్రీ, రామలక్ష్మమ్మా మాట్లాడుకొనే మాటలు వినిపిస్తూనే ఉన్నాయి. రామలక్ష్మమ్మ రాధ తండ్రి జానకిరామయ్యగారికి దూరపుబంధువు.

"బాబుగారూ, అబ్బాయి ఇంతకీ ఎలా ఉంటాడూ?" అడిగింది రామలక్ష్మమ్మ. రాధ చెవులు రిక్కించింది.

"అబ్బాయి కేమమ్మా, బాగానే ఉంటాడు. ఇంకెంత, ఓ గంటసేపట్లో వస్తారుగా. నువ్వే చూడు" అన్నారు జానకిరామయ్య.

"అమ్మాయి ఇష్టపడ్డట్టేనా?"

"ఇష్టపడ్డట్టే. ఇష్టం లేకపోతే చెప్పేసున్నాను. 'మీ ఇష్టం, నాన్నా!' అన్నది. దానికి ఇష్టం లేకపోతే అసలు ఈ పెళ్ళి చూపులకి కూడా ఒప్పుకొనేవాడిని కాదు. ఫోటోలు చూసిన తరవాతే పెళ్ళిచూపుల నిర్ణయానికి వచ్చాను."

"అవును, బాబూ! ఒక్కగానొక్క పిల్ల. ఆమె ఇష్టం లేకుండానా?" అంది రామలక్ష్మమ్మ.

"ఇంతకూ అబ్బాయి ఏం చదివాడటా?" అడిగింది రామలక్ష్మమ్మ మళ్ళీ ఊరుకోలేక.

"ఎమ్. కామ్. పాసయినాడట. ఇక ఉద్యోగం రేపో మాపో వస్తుందనుకో. కాకపోయినా బాగా ఉన్న వాళ్ళే. కాలుమీద కాలు వేసుకు కూర్చున్నా జరిగి పోతుంది."

"ఇకనేం? అన్నివిధాలా అనుకూలంగా ఉంది. రాధమ్మా ఇష్టపడిందిగా. తొందర్లోనే కానివ్వండి."

"అవునవును. రాధ పరీక్షలవగానే చేసేద్దాం. దాన్నో ఇంటిదాన్ని చేస్తే నా కింక చింత లేదు" అన్నా రాయన.

అటు తరవాత రాధకు వాళ్ళ మాటలు వినపడలేదు. అసలు వింటేగా...?

• • •

గుమ్మం ముందు టాక్సీ ఆగిన చప్పుడు అవగానే

అంతవరకూ కాలుగాలిన పిల్లిలా తిరుగుతున్న జానకిరామయ్యగారు వాకిట్లోకి పరిగెత్తారు.

స్నేహితుని భుజంమీద చెయ్యి వేసి టాక్సీలోంచి దిగుతున్న కృష్ణను చూసి ఆశ్చర్యపోయారు.

"ఏమయింది కాలికి?" ఆదుర్దాగా అడిగారు.

"అబ్బే! ఏం లేదు, బాబూ! ఉదయమే బాత్‌రూమ్‌లో స్నానం చేస్తూన్నప్పుడు కాలు జారింది. మడమ బెణికింది. 'పోనీ, మరెప్పుడయినా వెడదాం' అన్నారు రామచంద్రయ్యగారు. 'ఈ మాత్రానికి ఆగిపోవడం దేనికి? ఫరవాలేదు. జానకిరామయ్యగారేమీ అనుకోరు' అని బలవంతంచేసి తీసుకొచ్చాను." వివరించాడు పెళ్ళికొడుకు పేరయ్య.

"అయ్యో, అలాగా! కాస్త ఆలస్యమయితే అయేది, డాక్టర్‌కు చూపించి, ఏదైనా ఇంజక్షన్ చేయించుకొని వస్తే బాగుండేది" అన్నారు జానకిరామయ్య.

"ఫరవాలేదు, బావగారూ! అంత కంగారు పడతారేం?" అన్నాడు వరస కలిపేస్తూ, కృష్ణ తండ్రి రామచంద్రయ్య.

వారిని లోపలకు తీసుకువచ్చి సోఫాల్లో కూర్చుండబెట్టిన తరవాత రామలక్ష్మమ్మను పిలిచి కాఫీ, ఫలహారాలు తెప్పించారు జానకిరామయ్య.

లోకాభిరామాయణం మాట్లాడుతూ ఫలహారాలు సేవించారు.

మానవజీవితంలో ... వివాహఘట్టంలో ... ఈ పెళ్లిచూపుల దో ప్రత్యేక స్థానం. తరాలు మారాయి. మనుష్యులూ, మనసులూ, అభిరుచులూ అన్నీ మారాయి. కాని, ఈ పెళ్లిచూపులలోనే నాటికీ, నేటికీ మార్పు రాలేదు. మార్పు వచ్చినదల్లా — ఒకనాడు పెళ్లిచూపులలో వరుడు అంగీకరిస్తే వివాహమయేది; ఈనాడు వధువూ, వరుడూ ఇద్దరూ అంగీకరించాలి అనే విషయంలోనే.

పెళ్లిచూపుల పేరుతో జరిగే హంగామా అంతా ఇంతా కాదు. చూపులకు వచ్చే మగపెళ్లివారిని ఖర్చులు భరించి దూరప్రదేశాలనుండి పిలిపించుకొనే కన్యాదాతలున్నారీ కలియుగంలో. పాపం, ఇంత దూరప్రదేశానికి ఖర్చులు భరిస్తున్నారు గదా! పోనీ, ఒకరిద్దరు వెడితే చాలదా పెళ్లిచూపులకు అనే ఆలోచన వరుని బంధువులకు ఉండదు. 'సొమ్ము ఒకడిది, షోకు ఒకడిది' అన్నట్లు వరుని అమ్మమ్మ మొదలు వేలు విడిచిన మేనత్తవరకూ ... అందరూ పెళ్లికి వచ్చారా అన్నట్లు రావలసిందే. ఇంక, వారి కాఫీ, ఫలహారాలకు అయ్యే ఖర్చో? ఇలా ఒకటా, రెండా! ఎన్ని అయితే, ఎంత ఖర్చు అయితే ఆడపిల్లను కన్న తండ్రి కన్యాదానఫలం పొందగలడు? పెళ్లిచూపుల పేరుతో ఖర్చు పెట్టేది సగం పెళ్లికి ఖర్చు పెట్టేదే.

అందరూ ఏవో విషయాలు మాట్లాడుతున్నా కృష్ణ మాత్రం ఏమీ మాట్లాడటం లేదు. ఏదో దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు. అతని స్నేహితుడు మాత్రం మధ్యమధ్య మాట కలుపుతున్నాడు.

"అమ్మాయిని తీసుకురా, రామలక్ష్మమ్మా!" చెప్పారు జానకిరామయ్య.

తన గదిలో స్నేహితురాళ్లతో కూర్చున్న రాధ గుండెలు దడదడలాడాయి. రామలక్ష్మమ్మ వచ్చి ఆమెను నెమ్మదిగా నడిపించి తీసుకువచ్చి సోఫాలో

*ఎదటివారి లోపాలను ఎత్తి చూపుతూ, తమ లోపాలను కప్పి పుచ్చుకోడానికి ప్రతివారు ప్రయత్నిస్తారు. పెళ్లిళ్ల వ్యవహారంలో మరీని...కాని అత్మవంచన చేసుకోలేక తమ లోపాలను తామే బయటపెట్టుకునేవారు ఎందరుంటారు? ఉంటే వారి నిజాయితీని లోకం హర్షిస్తుందా?*

కూర్చుండబెట్టింది. ఆమె పక్కనే ఆమె కాలేజీ మేట్సు రాణి, కమల కూర్చున్నారు.


"తల వంచుకొంటావేం, కృష్ణా? చూడు" అన్నారు రామచంద్రయ్య.

అదే సమయంలో, "ఏం రాధా! ఫోటో అయితే చాలాసేపు చూశావుగానీ, ఎదురుగా మనిషినే ఉంచుకొని చూడవేం?" అంది కమల, రాధ చుబుకం పట్టి ఎత్తుతూ.

రాధాకృష్ణుల చూపులు ఒకేమారు కలుసుకొన్నాయి. క్షణంసేపు అతన్ని చూసి తల వంచేసుకొంది రాధ.

చదువుకొంటున్న యువతి అంతఃకితం ఎన్నో మార్లు పురుషులను చూచినా, వారిలో మాట్లాడినా సిగ్గుపడదు. కాని, ఈ సందర్భం వేరు; అనుభూతి వేరు. అంతమంది మధ్య, ఏర్పడబోయే ఏదో అనుబంధం దృష్టితో చూడాలంటే ఏ కన్నెపడుచు సిగ్గుపడదు?

**చెన్నబసవేశ్వరాలయ గోపురం (గుబ్బి)**
**ఫోటో—తలుపూరు సుబ్రహ్మణ్యము**
**(బెంగుళూరు–17)**



"నీ పేరేమిటమ్మా?" అడిగింది కృష్ణ తల్లి వర్ధనమ్మ. పేరు తెలియక కాదు, కాబోయే కోడలు కంఠ పరిశీలనకోసం.

"చెప్పు, తల్లీ!" అన్నారు జానకిరామయ్య.

"రాధ." రాధ గొంతునుండి చాలా నెమ్మదిగా మృదువుగా వచ్చా యా మాటలు.

"పాట లేమయినా పాడతావా? సినిమా సంగీతమా శాస్త్రీయ సంగీతమా? ఏదయినా ఫరవాలేదు." అడిగిందావిడ కాబోయే కోడలు అందచందాలూ, ఐశ్వర్యంలో కేవలం లక్ష్మేనా, లేక సంగీత సాహిత్యాలలో సరస్వతి కూడానా అని తెలుసుకొందామని కాబోలు.

"పాటా లేదు, గీటా లేదు. నువ్వూరుకో, అమ్మా!" అన్నాడు కృష్ణ విసుగ్గా.

వర్ధనమ్మ అదేమీ లెక్క చేయకుండా, "పోనీ. పాట పాడవద్దు గానీ ఒకసారి అటూ, ఇటూ నడుస్తావూ! ఇందాకా వచ్చేటప్పుడు సరిగ్గా చూడలేదు" అంది సన్నాయి నొక్కులు నొక్కుతూ.

ఆవిడ మాటలకు జానకిరామయ్యగారిలో ఆగ్రహం ముంచుకొచ్చింది. కాని, ఆడపిల్లను కన్న తండ్రి ఇవ్వన్నీ భరించక తప్పదని నిగ్రహించుకున్నారు.

"అమ్మా! ఇటువంటి వ్యవహారాలు నా కిష్టం లేదు" అన్నాడు కృష్ణ కోపంగా.

"అదేమిట్రా? ఇప్పుడే చూచుకోవడం మంచిది" అం దావిడ తాపీగా.

"పోనీలేవే. ఇందాక నేను చూశాను. ఫరవాలేదు. ఎందుకా పిల్లను ఇబ్బంది పెట్టడం? చదువుకొన్నదైనా సిగ్గుపడుతూంది" అని భార్యతో అని, జానకిరామయ్యవైపు తిరిగి, "బావగారూ! ముహూర్తం నిర్ణయించుకొని వ్రాయండి. మీరు ఎప్పుడంటే అప్పుడే" అన్నారు రామచంద్రయ్య.

రాధను లక్ష్మమ్మ లోపలకు తీసుకువెళ్లింది.

మరోమారు కాఫీలు సేవించి జానకిరామయ్య దగ్గిర సెలవు తీసుకొన్నా రందరూ.

* * *

సంతకం పెట్టి, రిజిస్టర్ కవరు తీసుకొని తన గదికి వచ్చింది రాధ. మంచంమీద కూలబడి కవరు మీద అడ్రసు చూసింది, 'ఎవరు వ్రాశారా?' అని. ఆ వ్రాతకూడా పరిచయంలేనిదిగానే ఉంది. కవరు చించి లోపలి ఉత్తరాన్ని పైకి తీసింది.

"రాధాదేవీ,

ఈ ఉత్తరంలో నేను వ్రాయబోయే విషయానికి ముందు నన్ను నేను పరిచయం చేసుకోవలసి ఉంది. ఈ నెల 22 న పెళ్లిచూపులకు వచ్చిన వరుడు మీకు జ్ఞాపకం ఉంటే, ఈ ఉత్తరం వ్రాస్తున్నది ఎవరో తెలుస్తుంది.

ఎందుకోగాని, నాకు చిన్ననాటినుండి ఒకరిని మోసగించడం అంటే నన్ను నేను ఆత్మవంచన చేసుకోవడంవంటి దనుకొనేవాణ్ణి. అటువంటిది, జీవిత భాగస్వామినిగా ఎంచుకోబోయే మిమ్మల్ని...మిమ్మల్నే కాదు, మరెవరినైనా మోసగించడం నాకు ఇష్టం లేదు.

మీ ఫోటో చూసినప్పుడే మీరు నన్ను ఆకర్షించారు. కానీ, నా స్వార్థం కోసం మిమ్మల్ని వంచించ లేను.

నేను కుంటివాడిని!

పెళ్లిచూపులకు వచ్చినరోజున టాక్సీ దిగుతున్నప్పుడు

ఆ విషయం దాచి, కాలు విరిగిందని అసత్యమాడాడు పెళ్ళిళ్ళ పేరయ్య. అదీ మా తలిదండ్రుల ప్రోద్బలం మీద!

ఒక్కగానొక్క కొడుకునైన నాకు పెళ్ళి కాదన్న భయంతో అపరంజి బొమ్మలాంటి మీరు కోడలుగా దక్కరని నా తల్లితండ్రులు ఈ నిజాన్ని మీనుండి దాచారు.

వారి తరఫున నేను క్షమాపణ కోరుతున్నాను.

ఈ విషయం మీకు తెలియజేయడం నా ధర్మం. అందువలన మీరు నాకు దక్కకపోవచ్చు.

కాని, పెళ్ళి అయిన తరవాత మీకు తెలియక పోదు. తరవాత సంసారం నరకం! అంతకంటే మీరు దూరమవడమే మంచిది.

'రాధ'లాంటి మీకు శనిలాంటి నేను తగను. మరో 'కృష్ణుణ్ణి' చేపట్టి, మీ జీవితం నందనవనం చేసుకోండి! ముహూర్తం నిర్ణయింపక ముమునే, నాకంటే మీరే ఈ వివాహానికి అనంగీకారం తెలియ జేయడం ఉత్తమం అనుకొంటాను. సెలవా మరి?

—కృష్ణ."

ఆ ఉత్తరం ఒకటికి రెండు మూడు మార్లు చదివింది రాధ. మంచంమీద వెనక్కి వాలి ఆలోచిస్తూ ఉండిపోయింది.

అప్పుడే వేసవి వచ్చిందా అన్నట్టుంది ఎండ. వీథిలోని దుమ్ము సుడిగాలికి గిరున తిరుగుతూ ఎగురుతూంది.

నెమ్మదిగా లేచి తండ్రి గదివైపు నడిచింది రాధ.

పడకకుర్చీలో వాలి దినపత్రిక చదువుతున్న జానకిరామయ్యగారు, అడుగుల చప్పుడు విని తల ఎత్తి చూశారు.

"అమ్మా, నువ్వా! రామ్మా. కూర్చో" అన్నారు కుర్చీ ముందుకు తోస్తూ.

రాధ ఏకైక సంతాన మాయనకు. అపురూపంగా పెంచారు తల్లిలేని రాధను. రాధ కుర్చీలో కూర్చుని, ఉత్తరం తీసి ఆయన కిచ్చింది. ఆయన అందుకొని ఆమెవైపు చూశారు.

"చదవండి, నాన్నా!" అన్నది రాధ తల వంచుకొని, దినపత్రిక అందుకొంటూ.

ఆయన విప్పి చదివారు. సగం చదవగానే మొహం జేవురించింది. పూర్తిగా చదివి విసిరికొట్టారు.

"ఇడియట్స్! తన కుంటికొడుకుని నా బంగారు తల్లికి చేసుకొందామనుకొన్నాడు కాబోలు! ఆ పెళ్ళిళ్ళ పేరయ్య అయినా ఎందుకు చెప్పలేదు? లంచం పెట్టారేమో వాడికి? నీచులు...ఇప్పుడే వ్రాసేస్తాను, మీ బోడిసంబంధం మా కవసరం లేదని." ఆవేశంతో ఊగిపోయా రాయన.

"తొందరపడకండి, నాన్నా! మీరు చూశారుగా, మీ రైనా కనిపెట్టలేదా ఆ విషయం?" అడిగింది రాధ.

"లేదమ్మా. రూపం చూసి మోసపోయాను. ఆ రోజు టాక్సీ దిగుతున్నప్పుడే అనుమానం కలిగింది. కాని, పేరయ్య మడమ బెణికిందని బొంకాడు. నిజమే అనుకొన్నాను. బహుశా ఆ పాదం లేదేమో. బూటు బిగించాడుగా, ఎవరికి తెలియనివ్వకూడదని కాబోలు!" ఆయన లేచి టేబుల్‌మీద పోస్టుకార్డు అందుకొని పెన్ తీశారు.

"తొందరపడకండి, నాన్నా!" అంది రాధ, పేపరు లోంచి తల ఎత్తకుండానే.

"ఇంకా తొందరపడటమేమిటమ్మా. ఆ నీచులతో మనకేమిటి?" అన్నారు జానకిరామయ్య రాధవంక చూస్తూ.

"వా శ్లెటువంటివా ళ్లయితేనేం, నాన్నా, మనకు కావలసింది అతను. నాకు అభ్యంతరం లేదని వ్రాసెయ్యండి!" అంది రాధ చివాలున లేచి తన గదిలోకి నడుస్తూ.

జానకిరామయ్యగారు స్థాణువులా కూర్చుండి పోయారు, కూతురి మనస్సు సరిగా అర్థంకాక.

• • •

"రాధా, నేను కుంటివాణ్ణని వ్రాసినా నన్ను పెళ్ళి చేసుకొందుకు ఎందుకు అంగీకరించావు?" అడిగాడు కృష్ణ వివాహమయిన నాటి రాత్రి, రాధను.

రాధ జవాబు చెప్పలేదు. అతని వంక క్రీగంట చూసి తల వాల్చుకుంది. ఆమె చుబుకం పట్టి తల పైకెత్తుతూ, "జవాబు చెప్పవూ?" అని అడిగాడు కృష్ణ.

అతని కళ్ళలోకి ఒక మారు చూసి, అతని చెయ్యి విడిపించుకొని టేబుల్ దగ్గిరికి నడిచింది. టేబుల్‌మీది కృష్ణ విగ్రహం చూస్తూ గొంతు విప్పింది.

"ఈ లోకమే ఒక నాటక రంగం. నాటకంలో తన పాత్ర అందరిచేతా మెప్పింపబడాలనే ఆశతో ఎన్నోవిధాల శ్రమించినట్లే జీవిత నాటకంలో గూడా తమ సుఖం కోసం, స్వార్థం కోసం అనుక్షణమూ శ్రమిస్తుం దీ మానవలోకం. అందుకోసం మోసాలూ, ఆత్మవంచనలూ చేయడానికీ, చేసుకోవడానికి వెనుదీయరు.

ఎదటివారి లోపాలను ఎత్తిచూపుతూ తమ లోపాలను కప్పిపుచ్చుకోవడానికి యత్నిస్తారు. అందునా తాము పెళ్ళాడే స్త్రీ విషయంలో అయితే మరీనూ. పురుషుడు తాను నల్లగా ఉన్నా, తనకు కాబోయే భార్య తెల్లగా ఉండాలంటాడు. ఆ సమయంలో తాను నల్లగా ఉన్నాననే విషయం మరిచిపోవడానికీ, మరిపించ డానికి ప్రయత్నిస్తాడు.

మీరు అటువంటి ప్రయత్నమేదీ చేయలేదు. మీ తల్లితండ్రులు దాచినా, మాకు తెలియకపోయినా ఉత్తరం వ్రాశారు. అప్పుడే మీరు ఉత్తరంలో వ్రాసినట్లు మీకు మీరు ఆత్మవంచకులు కారని గ్రహించాను. మిమ్మల్ని కాదని మరొకర్ని చేసుకొన్నా, అతను ఏ లోపమూ లేనివాడని నమ్మకం ఏమిటి?

తనని తాను ఆత్మవంచన చేసుకోని మీరు నాకు నచ్చారు. మీ నిష్కల్మష హృదయం, నిస్వార్థత నన్ను మీ లోని లోపాన్ని గురించి ఆలోచించ నివ్వ లేదు. మీలో బాహ్యసౌందర్యంకంటే అంతఃసౌందర్యాన్ని చూడగలిగాను నేను. అదీగాక మీ ఫోటో చూసినపుడే మీరే నా కృష్ణు డనుకొన్నాను."

కృష్ణ కొన్ని నిమిషాలపాటు ఆమెనే చూస్తూండి పోయాడు. నెమ్మదిగా కుర్చీలో కూలబడి బూటు లేసులు విప్పసాగాడు. "చూడు, రాధా! చిన్నప్పుడే కుడిపాదంమీదనుండి కారు పోయింది. మడమవరకూ తీసేశారు."

రాధ అతని చేతులను బూటుమీదనుండి మృదువుగా తొలగించింది. "ప్లీజ్, తీయవద్దు. ఈ ఆనంద సమయంలో మీరు మీ కాలు చూచుకొని మరో మారు ఎందుకు క్రుంగిపోతారు?" అన్నది నెమ్మదిగా.

"ఇంక నేను క్రుంగిపోను, రాధా! నువ్వున్నావుగా, నన్ను సహృదయంతో అర్థం చేసుకొని అండనుండే అనురాగమూర్తివి!" అన్నాడు కృష్ణ, రాధ కళ్ళలోకి అనురాగంగా చూస్తూ.

కిటికీనుండి లోపలికి వచ్చిన పిల్లతెమ్మెరలు వా రిద్దరినీ ఆశీర్వదిస్తున్నట్లు వారి తలలమీదుగా సరిగెత్తాయి. ★

సంధ్యావందనం



ఫోటో— కె. వి. రామమోహన్‌రావు (భువనేశ్వర్)

కప్పదాటు

